క్లుప్తంగా

కరకట్ట రహదారిలో వ్యర్థాల తొలగింపు



మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవి నుంచి అయోధ్య కరకట్టపై ఉన్న చెత్తాచెదారం తొలగించి సున్నం చల్లించడంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల నుంచి తెచ్చిన వ్యర్థాలను కరకట్టపై వేయడంతో కరకట్ట వెంట వెళ్లే ఐదు గ్రామాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య తన దృష్టికి రావడంతో మోపిదేవి పంచాయతీ సర్పంచ్ నందిగం మేరీ రాణి స్పందించి వ్యర్థాలను తొలగించి సున్నం చల్లించారు.

ప్రారంభానికి సిద్ధమైన సీసీ రోడ్లు



మోపిదేవి: మండలంలోని పెదకళ్లేపల్లిలో మచిలీపట్నం ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. గండు నాగేశ్వరరావు ఇంటి నుంచి లైబ్రరీ వరకు 120 మీటర్ల సీసీ రోడ్డును ఎంపీ నిధులు రూ.5 లక్షలతో పాటు పంచాయతీ నిధులు రూ.50 వేలతో నిర్మించామని పేర్కొన్నారు. గండు వారి రామాలయం నుంచి ఎస్టీ కాలనీ వరకు 110 మీటర్ల రోడ్డును రూ.5 లక్షలు, గుంటూరు సుభాష్ చంద్రబోస్ ఇంటి నుంచి అమ్మవారి గుడి వరకు 110 మీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు వివరించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు కొమ్మారెడ్డి విద్యార్థి ఎంపిక



అభిరామ్

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.అభిరామ్ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు ఎంపికయ్యాడని స్కూల్ డైరెక్టర్ కె.కిషోర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థికి రూ.10 వేల చొప్పున ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ కిట్ల పంపిణీ



కోడూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు రెడ్ క్రాస్ సొసైటీ మండలశాఖ ఆధ్వర్యంలో శానిటరీ కిట్లు, మాస్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యాలయం వద్ద సొసైటీ చైర్మన్ వేజండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15 మందికి ఈ కిట్లను అందించారు. సొసైటీ సభ్యులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సొసైటీ వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, కోశాధికారి తోట గోపి, సభ్యులు రేపల్లె యోగప్రకాష్, జొన్నా రవిశంకర్ పాల్గొన్నారు.

ఇద్దరు బైండోవర్

కోనేరుసెంటర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేకాట, కోడిపందేల నిర్వహణకు పాల్పడే ఇద్దరిని మచిలీపట్నం పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశారు. బందరుకోటకు చెందిన బచ్చుల రమేష్, మేదరుబజారుకు చెందిన శీలం నాగమల్లేశ్వరరావు కోడిపందేల నిర్వహణకు సిద్ధం అవుతున్నట్లు అందిన సమాచారంమేరకు మచిలీపట్నం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. సొంతపూచీకత్తుపై ఆ ఇద్దరిని తహసీల్దార్ విడుదల చేశారని పోలీసులు తెలిపారు.

• కప్పేసిన పొగమంచు





చల్లపల్లి బైపాస్‌రోడ్డులో పొగమంచులో ప్రయాణం

కొద్ది రోజులుగా దట్టమైన పొగ మంచు కురుస్తుండటంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజాము నుంచి మచిలీపట్నం నగర శివార్లలో రహదారుల వెంబడి పొగమంచు వర్షాన్ని తలపించేలా కురుస్తోంది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు తొలగడంలేదు. లైట్ల వెలుగుల్లోనే వాహనాలు ప్రయాణించాల్సి వస్తోంది. లైట్లు వేసినా అతి సమీపంలోకి వచ్చే వరకు ఎదుటి వాహనాలు కనిపించడంలేదని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

– మచిలీపట్నంటౌన్

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 36వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం రాత్రితో ముగిసింది. ఈ డివిజన్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు శనివారం డివిజన్ సచివాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే రూ.20 లక్షలను డివిజన్‌లో అత్యవసరమైన పనులు చేసేందుకు కేటాయిస్తామన్నారు. ఆర్థికేతర సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్ని కిట్టు కోరారు. కార్పొరేటర్లు గోపిశెట్టి సతీష్, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గోని గాంధీ, డివిజన్ కన్వీనర్ జవ్వాది రాంబాబు, దార్ల చెన్నకేశవరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పేర్ని కిట్టు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం పేర్ని కిట్టు, డివిజన్ నాయకులు, కార్పొరేటర్లను డివిజన్ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



పారిశుద్ధ్య కార్మికుడికి నూతన వస్త్రాలు అందజేస్తున్న పేర్ని కిట్టు, కార్పొరేటర్ రాంప్రసాద్ తదితరులు

రేపు స్విమ్మింగ్‌పూల్, జిమ్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక సర్కారుతోటలో ఆధునికీకరించిన స్విమ్మింగ్‌పూల్, నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌లను ఈ నెల తొమ్మిదో తేదీన ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కలెక్టర్ పి. రంజిత్‌బాషా వీటిని ప్రారంభిస్తారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ కె.ఝాన్సీలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిగంటలకు జరిగే కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున

బంటుమిల్లి: స్థానిక సాయి సిద్ధార్థ జూనియర్ కళాశాల 2023 క్యాలెండర్‌ను పెడన మార్కెట్ యార్డు ఆవరణలోమంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయి సిద్ధార్థ కళాశాల గ్రామీణ ప్రాంతమైన బంటుమిల్లిలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి దిలీప్ వెంకట పవన్‌ను మంత్రులు అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మలిశెట్టి రాజబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాదుల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

మోపిదేవి: స్థానిక జగనన్న లే అవుట్ (ఎస్టీ)–3 చేపట్టిన యానాదుల గృహాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పార్వతి సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఈ లే అవుట్‌ను ఆమె పరిశీలించారు. పునాది స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. తమకు పెట్టుబడి పెట్టే స్తోమతు లేదని, ఇటీవల ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ తమ గృహాలు పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానని చెప్పారని లబ్ధిదారులు ఎంపీడీఓకు వివరించారు. ఆ నిధులు రానందున సోమవారం జరిగే స్పందనలో కలెక్టర్‌ను కలసి తమ బాధలు చెప్పుకుంటామని తెలిపారు. కాలనీ రోడ్డును సరిచేయించాలని కోరారు. గృహనిర్మాణశాఖ ఏఈ తాండవ కృష్ణ, ఈఓపీఆర్డీ అరుణకుమారి, గ్రామ కార్యదర్శి త్రిపురసుందరి, మహిళా కానిస్టేబుల్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



గృహాలను పరిశీలిస్తున్న అధికారులకు తమ సమస్యలు చెబుతున్న లబ్ధిదారులు

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ

మచిలీపట్నంటౌన్: స్థానిక ఏడో డివిజన్ పరిధిలో చిలకలపూడి అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని యాదవుల బజారు సెంటర్‌లో పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో ఈ ప్రాంత ప్రజల అవసరార్థం ఈ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో నగరంలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు వీలు కలిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరిస్తున్న ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు పడమట రేవతి, తిరుమలశెట్టి వరప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చలమలశెట్టి గాంధీ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, మునిసిపల్ డీఈ వెంకటరమణ, ఏఈ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేసి డ్రెయిన్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న డెప్యూటీ మేయర్ కవిత

రైతు కుటుంబాలకు పీఏసీఎస్ ఆర్థిక సాయం

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సహకార వ్యవస్థ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని కొడాలి ఏఎంసీ డైరెక్టర్ శీరం వెంకట సత్యనారాయణ (నానీ) అన్నారు. శనివారం చల్లపల్లి పీఏసీఎస్ ఆ ధ్వర్యంలో రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశా రు. స్థానిక పీఏసీఎస్ సభ్య రైతు, లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడకు చెందిన సూదాని సురేష్ ఇటీవల మృతి చెందాడు. కేడీసీసీ బ్యాంక్ ద్వారా చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అందిస్తున్న సహాయం రూ.6వేలు, సంఘ సభ్యుల సంక్షేమ నిధి నుంచి రూ.10వేలు, సొసైటీ నిధి నుంచి రూ.4 వేలు కలిపి రూ.20 వేల సాయాన్ని సురేష్ సతీమణికి శీరం నానీ చేతులమీదుగా అందించారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌లో ఇటీవల సొసైటీ సభ్య రైతు మార్గాని వీరేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబానికి చల్లపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అందించారు. కార్యక్రమంలో లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు నూకల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ తోట కృష్ణారావు, పర్సన్ వేముల ఏడుకొండలు పాల్గొన్నారు.



సహాయం అందిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ శీరం నానీ

తల్లిపై తనయుడి దాడి

కోనేరుసెంటర్: మద్యం మత్తులో ఉన్న కొడుకు తల్లిపై దాడి చేశాడు. ఈ ఘటనపై మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. బందరుకోటకు చెందిన తిరుమలశెట్టి చందు మద్యానికి బానిసై రోజూ ఇంట్లో గొడవలు చేస్తుంటాడు. శనివారం మద్యం మత్తులో ఉన్న చందు డబ్బులు ఇవ్వాలని తల్లి రమాదేవిని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన చందు తల్లిని బలంగా పట్టుకుని గోడకు గుద్దాడు. ఈ ఘటనలో రమాదేవి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం స్థానికులు బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మచిలీపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

నేడు దేవరకోటలో వైద్యశిబిరం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం దేవరకోట ఎస్‌ఆర్‌ఆర్‌కే హాస్పిటల్ వద్ద ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు దేవరకోట చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన డాక్టర్ వేమూరి కృష్ణమూర్తి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వేమూరి శోభారాణి, విజయవాడ రమేష్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గుండెవైద్య నిపుణుడు డాక్టర్ అజిత్ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. విజయవాడ నయన కంటివైద్యశాల డాక్టర్లు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఇనగుదురుపేట పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని, వారి వద్ద రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదానగర్‌లో పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారంపై ఎస్‌ఐ ఫిరోజ్ సిబ్బందితో కలిసి ఈ దాడి నిర్వహించినట్లు సీఐ ఉమామహేశ్వర రావు తెలిపారు.

కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు సూచించారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులోని న్యాయసేవాసదన్‌లో కేసుల పరిష్కారానికి భాగస్వామ్య శాఖలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో ఆయా శాఖల అధికారులు రాజీపడదగిన కేసులను గుర్తించాలని కోరారు. ఆ కేసులను సంబంధిత న్యాయవాదుల ద్వారా లోక్‌అదాలత్‌కు సిఫార్సు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే సమయంతో పాటు సొమ్ము ఆదా అవుతుందని కక్షిదారులకు తెలియజేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు ముందుగా కేసులను గుర్తించి న్యాయవాదులు, కక్షిదారులతో మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు రామకృష్ణ, చినబాబు, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్పీ మాసూం బాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తదితరులు

పకడ్బందీగా సమగ్ర భూ సర్వే : ఆర్డీఓ

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను బందరు ఆర్డీఓ ఐ.కిషోర్ ఆదేశించారు. గూడూరు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో ఆర్డీఓ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిషోర్ మాట్లాడుతూ.. సమగ్ర భూ సర్వేలో ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం చేకూరుతుందన్నారు. స్పందన ద్వారా వస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆర్డీఓ ఆదేశించారు. తహసీల్దారు బి.వి.ప్రసాద్, డీటీ శివశంకర్, మండల సర్వేయరు వెంకటేవ్వరరావు, ఆర్ఐ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిషోర్

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా

చల్లపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ కార్మికుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన తాపీ కార్మికుడు అబ్దుల్ షరీఫుద్దీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలు మంజూరవగా, తొలివిడత తక్షణ సాయం కింద శనివారం రూ.10 వేలను షరీఫుద్దీన్ భార్య ఆసియాబేగంకు గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు మృతుడి నామినీ బ్యాంకు ఖాతాకు త్వరలో జమ అవుతాయని తెలిపారు. పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ గుంటూరు నరేష్ పాల్గొన్నారు.



తక్షణ సాయం అందిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి

ఘంటసాల ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన వేమూరి వెంకట్రావ్‌ను శనివారం పలువురు సత్కరించారు. ఈఓపీఆర్‌డీ గుత్తికొండ కిశోర్, కార్యదర్శులు కె.వి.సోమేశ్వరరావు, డి.రమాదేవి, వై.శివరామకృష్ణారావు, బోలెం అర్జునరావు, వైస్ ఎంపీపీలు కుంపటి నాగేంద్రబాబు, మోడెం నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు సిద్దినేని కుమార్‌రాజా, శ్రీకాకుళం, దేవరకోట సర్పంచ్‌లు ఎం.రవిప్రసాద్, మద్దాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్ వెంకట్రావ్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



వెంకట్రావ్‌ని సత్కరిస్తున్న ఈఓపీఆర్‌డీ, కార్యదర్శులు

తరగతి గదుల షెడ్డు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 13వ డివిజన్ రైలు పేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో వేదాన్ష్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2.80 లక్షలతో నిర్మించిన తరగతి గదుల షెడ్‌ను ఆ కంపెనీ ప్రతినిధి బత్తుల బోస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి మాట్లాడుతూ.. పాఠశాలలో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లటంతో స్పందించిన వారు ప్రభుత్వం నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు అందుబాటులోకి వచ్చేలోపు వినియోగించుకునేందుకు షెడ్లను నిర్మించారని తెలిపారు. డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), బందెల థామస్‌నోబుల్, గాజుల భగవాన్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జవ్వాది రాంబాబు, వేదాన్ష్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తరగతి గదుల షెడ్డును ప్రారంభిస్తున్న బత్తుల బోస్, చిత్రంలో పేర్ని కిట్టు

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం బోట్లవానిపాలెంలో బెల్టు షాప్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని బందరు రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 42 క్వార్టర్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ చాణక్య కథనం మేరకు.. బోట్లవానిపాలెం గ్రామానికి చెందిన బొర్రా శివనాగ్ మద్యం దుకాణాల్లో బాటిళ్లు కొనుగోలు చేసి గ్రామంలో అధిక ధరలకు అమ్ముతున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ చాణక్య సిబ్బందితో కలిసి అతని ఇంటిపై దాడి చేసి సోదాలు నిర్వహించారు. 42 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శివనాగ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతనిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ చాణక్య తెలిపారు.



నిందితుడు, లిక్కర్ బాటిళ్లతో రూరల్ పోలీసులు

భక్తిశ్రద్ధలతో సహస్ర తులసీ పూజ

గూడూరు: స్థానిక సీతారామస్వామి దేవస్థానంలో శనివారం భక్తి శ్రద్ధలతో సహస్ర తులసీ దళాలతో పూజ చేశారు. శ్రీరాముడు జన్మించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, హోమాలు, సహస్ర తులసీ పూజా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



సహస్ర తులసీ దళాల పూజ అందుకుంటున్న స్వామి

ఎండీఆర్టీకి అర్హత సాధించిన నిరూప్‌కు సన్మానం

కోడూరు: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థలో ఎండీఆర్టీకి అర్హత సాధించిన వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన నిరూప్‌ను సంస్థ ప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని రామాలయం వద్ద నిరూప్ సన్మాన సభ నిర్వహించారు. రెండేళ్ల నుంచి నిరూప్ ఎండీఆర్టీకి అర్హత సాధిస్తున్నట్లు సంస్థ అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. నిరూప్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఏబీఎం సాయిరామ్‌కిరణ్, డీఓ శివ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



నిరూప్‌ను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు